క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవాలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలో శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నాల్గవ రోజు సోమవారం కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో సుప్రభాత సేవ, నవనీత హారతి, నిత్య కైంకర్యాలు, నవ కుంభారాధన, నరసింహ హోమం, సాయంత్రం నిత్య హోమం, గరుడోత్సవం, ఆలయ బలిహరణ జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్రులు పర్యవేక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ చిర్రావూరు గ్రామానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం టీడీపీ నాయకులు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, జనసేన నాయకులు సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ గాయపడిన యువకుడు కిరణ్ కుటుంబానికి రూ.5,75,762, అనారోగ్యం బారిన పడిన నాగబాబు కుటుంబానికి రూ.46,962లను నగదు చెక్కులను వారి నివాసాలకు వెళ్లి అందజేసినట్లు తెలిపారు.

అదనపు బస్సు సర్వీసులు కల్పించాలి



తాడికొండ: రాజధాని ప్రాంతంలో ఆర్టీసీ ప్రాంతంలో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు వేడుకొంటున్నారు. రాజధానిగా తుళ్లూరును ప్రకటించిన నాటి నుంచి సచివాలయం, అసెంబ్లీ, సీఆర్డీయే ఇతర పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఆయా అవసరాలకు తగ్గట్టుగా బస్సు సర్వీసులను పెంచకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం 10 వేల మందికి పైగా పాఠశాలలు, కళాశాలలు, చేతి వృత్తులు, వ్యాపారాల నిమిత్తం ప్రయాణాలు చేస్తుంటారు. వీరందరికీ సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి రాజధాని ప్రాంతంలో బస్సు సర్వీసులను పెంచాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు ఫరీనాబేగం అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. 154మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల శుభ్రత పాటించాల్సిన పద్ధతులు గురించి వివరించారు. ప్రతి వారం ఫ్రైడే–డ్రైడేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వేసవి వస్తుండటంతో తాగునీటిని వృథా చేయకుండా పరిశుభ్రమైన నీటిని తాగాలని చెప్పారు. పరిశుభ్రమైన నీరు తాగకుంటే అనారోగ్యాల బారిన పడేప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రజిత, ఏఎన్‌ఎం విజయరాణి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతున్నా.. ఇప్పటి వరకు విద్యార్థులను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. వారి సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలు చేస్తున్నా సర్కారు స్పందించకపోవడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని నేటి రాష్ట్ర విద్యాశాఖమంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఆయన ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు రవి, అఖిల్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దొంతిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

వైఎస్సార్‌సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్ చేయకపోవడంతో కళాశాలల విద్యార్థులను యాజమాన్యాలు బయటకు పంపుతున్నాయని మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే యువత పోరు పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులు, యువకులు, తల్లితండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేదలను విద్యకు దూరం చేసేందుకు.. కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కళాశాలలకు ఫీజులు చెల్లించడం లేదన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు విద్యను అందించి, వారి భవిష్యత్తును ఉన్నత స్థాయికి చేరాలనే లక్ష్యంతో పని చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి పేదలకు ఇంజినీరింగ్, మెడికల్ విద్యను అందించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు నాడు – నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించారన్నారు. ఈ నెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జండాను ఆవిష్కర జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్, అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, నియోజకవర్గ అధ్యక్షురాలు చిలూవూరి షిలోమినా, ఆర్గనైజింగ్ సెక్రటరీ దామర్ల కుభేర స్వామి పాల్గొన్నారు.

యువత పోరుకు భారీగా తరలిరండి



పోస్టరు విడుదల చేస్తున్న తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ఈ నెల 12న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరుకు భారీగా విద్యార్థులు, యువత తరలిరావాలని ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం గుంటూరు మల్లికార్జునపేటలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫీజు రీ ఎంబయిర్స్‌మెంట్ కింద రూ.4,600 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులను యాజమాన్యాలు కళాశాలల నుంచి బయటకు పంపించే పరిస్థితి వచ్చిందన్నారు. అయినా ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమని వజ్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుకోవాల్సిన వారు కూలీలుగా వ్యవసాయ పనులకు వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పూర్తిగా కుంగదీసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. కార్పొరేట్‌కు రెడ్ కార్పెట్ పరుస్తున్న కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఇంటింటికీ తిరిగి హామీలిచ్చిన చంద్రబాబు నేడు ఆ జాడే లేకుండా లోటు బడ్జెట్ అంటూ తిరుగుతుండటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అప్పులు ఊబిలో రాష్ట్రాన్ని ముంచెత్తి ఎల్లో మీడియాలో మాత్రం గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, తాళ్లూరి వంశీ ముప్పాళ్ల మనోహర్, దాసరి రాజు, చుండు వెంకటరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, ఆరేపల్లి జోజి, దానం వినోద్, రామ్మోహన్ రెడ్డి, దాసరి సురేష్, షేక్ సలీమ్, మన్నవ రాజేష్, షేక్ అబ్బాస్ పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గంలో వాడవాడలా వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య ఆధ్వర్యంలో కొనలనుకొండ, చిర్రావూరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు అందక, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నిస్తే వారిపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి, బెదిరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారికి అండగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కొలనుకొండ అధ్యక్షులు నూతక్కి శ్రీనివాసరావు, జాలి శ్రీనివాసరావు, గొడ్డిపాటి వెంకటేశ్వరరావు (జీవీఆర్), సింకా నాగేశ్వరరావు, షేక్ రబ్బాని, సికాపోల్, సాంబశివరావు, చిర్రావూరు మాజీ సొసైటీ అధ్యక్షులు, చిర్రావూరులో పార్టీ అధ్యక్షులు, మేకల సాంబశివరావు, జెట్టి రాంబాబు, పోకల రాంబాబు, బసగానపల్లి మోహనరావు, జెట్టి కోటేశ్వరరావు, వంశీ, ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, నారంశెట్టిబాబు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో ఫాల్గుణ మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, గుంటూరు ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫాల్గుణ మాసం, ఫాల్గుణ పూర్ణిమ పర్వదినాలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సృష్టి ఆదిలోనే ఆకాశ వాణిగా ఆదిత్యునికి బోధచేయబడినదే గీతా సారమని, తిరిగి ద్వాపర యుగంలో భగవానుడైన శ్రీకృష్ణుడు భక్తుడైన అర్జునునికి గీతోపదేశం చేశాడని వివరించామని తెలిపారు. దేవుని జ్ఞానం తెలుసుకోవాలని, సర్వ మానవాళికి సమన్వయం జ్ఞానాన్ని అందించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కమిటీ సభ్యులు టి.వి. కృష్ణారావు, బ్యాంకు శ్రీను, ఆర్. రామకృష్ణ, బి. శివలింగం నాయక్, టి. బ్రహ్మం, రామోజీ నాయక్, సుబ్బారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్ : ప్రభుత్వం ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, యాజమాన్యాలకు వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చి పెట్టిన కార్మికులకు వారికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇమాంబి, నవనీతం, విజయశ్రీ, రిబ్కా, హగ్గయ్య, దానయ్య, గువరయ్య, మల్లేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్ల సాధనకు 12న ధర్నా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాలరాజు

దుగ్గిరాల: మండలంలోని చిలువూరు గ్రామ పంచాయతీలో సోమవారం సీపీఎం జిల్లా కార్మిక సంఘం నాయకులు జెట్టి బాలరాజు ప్రచారం నిర్వహించారు. మార్చి 12న విజయవాడ ధర్నాచౌక్ దగ్గర జరగబోయే మహాధర్నాకు గ్రామ గ్రామన తిరిగి చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ కార్మికులకు వేతం పెంపు, ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన కోరారు. ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఆయన వెంట ఎం.అంజయ్య, కె.ప్రభాకర్, వెంకటస్వామి, రావు రామయ్య ఉన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాలలో సోమవారం సావిత్రీ బాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శోభాదేవి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ విద్యను ప్రోత్సాహించి పేద వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని, తన భర్త జ్యోతిరావుపూలే ద్వారా విద్యను అభ్యసించి మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయ్యారని, ఆమె జీవితం ఎన్నో పోరాటాలు, సమాజంలోని అసమానతలు నిర్మూలన కొరకు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

మంగళగిరి టౌన్ : సవాళ్లను ఎదుర్కొని పేదలకు విద్యను అందించిన ధీరవనిత సావిత్రిబాయి అని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే అడుగు జాడల్లో నడవాలని కేశన శంకరరావు సూచించారు. జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు ఉడతా శ్రీనివాసరావు, బాష, జిలాని పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి



మంగళగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్, పరీక్షను రద్దు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ డిమాండ్ చేసింది. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద సోమవారం ఏపీ స్టూడెంట్స్ జేసీ, వివిధ యూనివర్శిటీ అధ్యక్షులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి కలిగిస్తూ ఆయా యూనివర్శిటీలు పీజీ సెట్‌లు నిర్వహించేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ మధుమూర్తిని కలసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్తార్ బాషా, కిషోర్, ఎస్కే యూనివర్శిటీ అధ్యక్షులు అమర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిర్రావూరు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మంగళగిరి అధికారిణి సులోచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు జులై 2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు గలవారై ఉండాలన్నారు. అభ్యర్థినులు స్థానిక వివాహితురాలై ఉండాలని, 7వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అనితెలిపారు. బయోడేటా, వయస్సు, కుల, విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు.. ఒంటి మహిళల అయితే 18 సంవత్సరాలోపు పిల్లలు ఉన్నవారు వయస్సు, భర్త మరణ ధృవీకరణ పత్రం, ఆధార్ నకళ్లకు గెజిటెడ్ అధికారి సంతకంతో దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు శిశు అభివృద్ధి పథకపు అధికారి, మంగళగిరిలోని భగత్ సింగ్ నగర్‌లోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దుకాణాల్లో తనిఖీలు



మంగళగిరి టౌన్ : ఎంటీఎంసీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ చర్యల్లో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ అధికారులు పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు నగర పరిధిలో దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 390 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామని, సుమారు రూ.35 వేల వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానాతో పాటు షాపులను కూడా సీజ్ చేస్తామని షాపుల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ శానిటరీ సెక్రటరీలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్లపై పనిభారం తగ్గించండి

డిప్యూటీ సీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయాల సర్వేయర్ల సంఘం నాయకులు

మంగళగిరి టౌన్ : రాష్ట్రంలోని గ్రామ సచివాలయాల సర్వేయర్లపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంగళగిరి నగరపరిధిలోని డిప్యూటీ కార్యాలయ సిబ్బందికి గ్రామ సచివాలయాల సర్వేయర్ల సంఘం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూరాడ మధుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేయర్లపై పనిభారం, వేధింపులు, ఒత్తిడులు ఎక్కువ అయ్యాయని అన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రోసీజర్స్ (ఎస్ఓపీ) ప్రకారం పనిచేయాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని, వీఆర్‌వోల పని కూడా తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేయర్లకు ఉన్న ఇబ్బందులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. పని ఒత్తిడితో సతమతమవుతున్న తమకు కనీసం సెలవులు కూడా మంజూరు చేయడం లేదని వాపోయారు. అర్హత గల గ్రామ సర్వేయర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగిలి వున్న 4722 మంది సర్వేయర్లను ఇతర శాఖల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నూజివీడు సర్వేయర్ మనోజ్‌కుమార్, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ సాయికుమార్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం..రూ. 1.60 లక్షల జరిమానా

విజిలెన్స్ ఇంజినీర్ పి.సుబ్రమణ్యం

మంగళగిరి: విద్యుత్ చౌర్యం.. సామాజిక నేరమని.. ఎవరు విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా విద్యుత్ శాఖ అభివృద్ధికి సహకరించాలని విజిలెన్స్, ఆపరేషన్ సీఆర్పీఏ సర్కిల్ ఇంజినీర్ పి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం మంగళగిరి మండలంలోని బేతపూడి, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, యర్రబాలెంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 3,525 సర్వీసులు తనిఖీలు చేయగా అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరీల్లో వాడుకుంటున్న నలుగురికి రూ.60 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుకుంటున్న 27 మందికి రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలలో విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఈఈ జె.సంజీవరావు, డీఈఈ సురేష్‌బాబు, ఏఈ ఎ.శివశంకర్, ఆపరేషన్ ఏఈ బి. చిన్న మంగారావు, 38 మంది అధికారులు 148 సిబ్బంది, 33 బృందాలుగా ఏర్పడి 3,525 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక తరలింపు



చెరువుగట్టు పైన ఉన్న ఇసుక తవ్వుతున్న పొక్లెయినర్

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలో సోమవారం చెరువు గట్టుకు పోసిన ఇసుకను అనుమతి లేకుండా అక్రమంగా తవ్వుతున్నట్లు గ్రామ సర్పంచ్ గంపల గంగాధరరావు తెలిపారు. గంగాధరరావు మాట్లాడుతూ 1.80 సెంట్లు గల స్మశాన స్థలంలో గతంలో 2021 నవంబర్ 19న ఉన్నటువంటి అక్రమ షాపులను తొలగించి, చదును చేసి గ్రామాభివృద్ధి కొరకు ఉపయోగించాలని తీర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు అదే స్థానంలో మళ్లీ యథావిధిగా షాపులు నిర్మించారని, పక్కనే ఉన్న చెరువు చుట్టూ ఇసుకపోసి వాకింగ్ ట్రాక్ వేసి ఆధునీకరణ చేయాలని పంచాయతీ తీర్మాణం చేసిందన్నారు. ప్రభుత్వ అండదండలతో వాకింగ్ ట్రాక్‌కు వేసినటువంటి ఇసుక, మట్టిని అనుమతి లేకుండా కొందరూ నేతలు పొక్లెయిన్‌తో తరలిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

కళలపై ఆసక్తి పెంచుకోండి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కృష్ణ, శ్రీనివాస్

తెనాలిఅర్బన్: కళల పట్ల కొందరికి ఆసక్తి ఉంటుందని, అలాంటి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం విద్యాసంస్థలపై ఉందని ప్రముఖ హార్మోనిస్ట్ బి.కృష్ణ, డ్యాన్స్ మాస్టర్ జె.శ్రీనివాసులు పేర్కొన్నారు. జేఎంజే మహిళా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం ఫోక్ డ్యాన్స్, స్టోరి టెల్లింగ్, సోలో సాంగ్స్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా విజ్ఞాన్ యూనివర్శిటీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విమలాదేవి, కె.అరుణోదయ వ్యవహరించారు. గుంటూరులోని జేకేసీ కాలేజ్, ఏసీ కాలేజ్, హిందూ కాలేజ్, టీజేపీఎస్ కాలేజ్, తెనాలిలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల, గుప్తా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పక్కన భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని, అప్పుడే ఉన్నత విజయాలు సాధించగలమని ప్రముఖ వైద్య నిపుణుడు జి.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. భాష్యం ఐఐటీ ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో సోమవారం స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఒత్తిడి సహజమని, ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, ప్రణాళికాబద్ధంగా దినచర్యను రూపొందించుకుంటే దీనిని అధిగమించవచ్చన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి భాష్యం విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. చదువు ఒక్కటే కాకుండా విద్యార్థులకు ఆసక్తి గల ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తూ ఒత్తిడి లేని విద్యా విధానానికి నాంది పలికామన్నారు. తొలుత అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలి మండలం కొలెవరానికి చెందిన నీలకంఠం కృష్ణమూర్తి అలియాస్ కృష్ణ, కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన అతని పెదనాన్న కొడుకు నీలకంఠం ప్రభుకుమార్ అలియాస్ ప్రభు గంజాయి విక్రయిస్తుండగా. టూటౌన్ సీఐ కె.రాములనాయక్ అదుపులోకి తీసుకున్నారు.